చేసిన నేరానికి తనని క్షమించమని వేడుకున్నాడు. తన వంక వాత్సల్యంతో చూస్తున్న ఆ సాధువుని అడిగాడు ప్రభుత్వాధికారి.

"స్వామి! మీరు ఫలానా అని ఇందాక నాకు ఒక్కమాట ఎందుకు చెప్పలేదు?"

"నువ్వేం అడిగావో, ఎందుకు కొడుతున్నావో నాకు తెలిస్తేగా నేను ఏదైనా మాట్లాడటానికి."

"ఈ పనిని మీశిష్యులకి చెప్పక మీరెందుకు చేస్తున్నారు?" మళ్ళీ ప్రశ్నించాడు అధికారి.

"ఇది గురువు పని తప్ప శిష్యులది కాదు. మనలో వుండే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ముళ్ళపొదలని పెరికివేస్తే కాని భగవత్ సాక్షాత్కారానికి మార్గం మనసులో కనిపించదు. ఇలాంటి ప్రవర్తన గల గురు సన్నిధిలోనే అది బాగా జరుగుతుంది." వివరించాడు సాధువు.

## 17. సిసలైన వజ్రం

ఓ అడవి నించి కట్టెలు కొట్టుకు వచ్చి గ్రామస్థులకి అమ్మే ఓ వ్యక్తిని, అదే అడవిలో తపస్సు చేసుకునే ఓ సాధువు గమనించేవాడు. వర్షాకాలంలో కట్టెలు తేలేని రోజు అతను, అతని కుటుంబ సభ్యులు పస్తులుండాల్సి వస్తుందని గ్రహించిన ఆ సాధువు, ఓరోజు అతని మీద జాలితో చెప్పాడు.

"నువ్వు దక్షిణం వైపు వెళ్తున్నావు. కాని ఉత్తరం వైపు వెళ్తే ఇత్తడి గనులు కనిపిస్తాయి. ఆ లోహం తెచ్చి అమ్ముకుంటే నీకు వారానికి సరిపడా తిండి దొరుకుతుంది."

వారం తర్వాత వాడు సాధువు దగ్గరకి వచ్చి చెప్పాడు.

"స్వామీ! మీరు చెప్పినట్లు చేసాను. మీకు నా కృతజ్ఞతలు."

"నీకిది చెప్పనేలేదు కదా? నువ్వు ఇంకాస్త ముందుకి వెళితే వెండి గనులు కనిపిస్తాయి. వెండి ముద్ద తెచ్చి అమ్ముకుంటే నెల పాటు నువ్వు, నీ కుటుంబ సభ్యులు హాయిగా బ్రతకచ్చు."

నెల తర్వాత అతను ఆ సాధువు దగ్గరకి వచ్చి తన కృతజ్ఞతలని తెలియచేసి ఆశగా అడిగాడు.

" బంగారు గనులు ఈ అడవిలో లేవా స్వామీ?"

"ఎందుకు లేవు? ఇంకాస్త ముందుకి వెళితే బంగారు గనులున్నాయి. నువ్వు మోయగలిగినంత తెచ్చి అమ్ముకుంటే నీ కుటుంబానికి ఏడాదికి సరిపడే ధనం లభిస్తుంది."

ఏడాది తర్వాత అతను సాధువు దగ్గరకి మళ్ళీ వచ్చాడు. అప్పటికే బాగా ముసలివాడైన ఆ సాధువు అతనితో చెప్పాడు.

"నేను ఆట్టే కాలం ఉండను కాబట్టి నీకీ రహస్యం చెప్తున్నాను. నువ్వు ఇంకాస్త ముందుకి వెళితే వజ్రాల గని కనిపిస్తుంది. నువ్వు మోయగలిగినన్ని రాళ్ళు తెచ్చుకుని అమ్ముకుంటే జీవితాంతం నువ్వు, నీ కుటుంబ సభ్యులు హాయిగా జీవించేంత డబ్బు వస్తుంది."

"నాకు ఆశ్చర్యంగా ఉంది. వీటి రహస్యాలని తెలిసిన మీరు వీటిని అనుభవించక ఈ అడవిలో కళ్ళు మూసుకుని కూర్చుని ఏం చేస్తున్నారు?" అడిగాడు అతను.

"నీలా నేనూ వజ్రం కోసమే ప్రయత్నిస్తున్నాను. ఆ వజ్రం దొరికితే ఇంక ప్రపంచంలోని ఏ వజ్రంతో అవసరం ఉండదు." జవాబు చెప్పాడు ఆ సాధువు.

ఆ సాధువు మరణించినా ఆ చెట్టు కింద మరో సాధువు కూర్చుని దైవ ధ్యానం చేయసాగాడు. అతను ఆ కట్టెలు కొట్టే అతనే.

## 18. దుస్తులు

ఓ రాజుగారు అలంకార ప్రియులు. ఆయన ఓ సారి దుస్తుల పోటీని ప్రకటించాడు. దేశంలోని దర్జీ పనివాళ్ళంతా కొత్త రకం దుస్తులని ఉత్సాహంగా కుట్టసాగారు. తాము కనిపెట్టిన విభిన్న దుస్తులు రాజుకి నచ్చితే బహుమతి లభిస్తుందని వారి ఆశ.